క్లుప్తంగా

వైఎస్ జగన్‌ను కలిసిన కాంతరాజు



మాజీ సీఎం వైఎస్ జగన్‌ను కలిసిన వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాంతరాజు

అమరాపురం: మడకశిర నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేయాలని మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సూచించినట్లు పార్టీ బీసీ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు హలుకూరు కాంతరాజు తెలిపారు. మంగళవారం తాడేపల్లిలో కేంద్ర పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్‌తో కలసి ఆయన వైఎస్ జగన్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. మడకశిర నియోజవర్గంలోని ఐదు మండలాల్లో పార్టీ పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నట్లు పేర్కొన్నారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ మీట్

మడకశిర: మడకశిర మున్సిపల్ సాధారణ సర్వసభ్య సమావేశం బుధవారం ఉదయం 10.30 గంటలకు కార్యాలయంలోని మీటింగ్ హాల్‌లో జరుగుతుందని కమిషనర్ జగన్నాథ్ తెలిపారు. మున్సిపల్ చైర్మన్, నరసింహరాజు అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో పలు అంశాల పై చర్చిస్తామన్నారు. సమావేశానికి సభ్యులందరూ తప్పకుండా హాజరు కావాలని కోరారు.

మాజీ ఎంపీ గంగాధర్‌కు ఘన నివాళి

పెనుకొండ రూరల్: దివంగత మాజీ ఎంపీ గంగాధర్ 20వ వర్ధంతిని పురస్కరించుకొని మండలంలోని హరిపురం వద్ద ఉన్న సమాధి వద్ద గంగాధర్ సతీమణి, ఎమ్మెల్సీ మంగమ్మ, కుటుంబ సభ్యులు మంగళవారం ఘనంగా నివాళులర్పించారు.

19, 20 జీఓలను రద్దు చేయాలి



పోస్టర్లు విడుదల చేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

పరిగి: కూటమి ప్రభుత్వం తెచ్చిన జీఓ ఎంఎస్ 19, 20లను వెంటనే రద్దు చేయాలని ప్రగతి శీల ప్రజా స్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని కొడిగెనహళ్లి బాలుర వసతి గృహంలో విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. ఆగస్టు 4, 5, 6 తేదీల్లో నంద్యాల పట్టణం జేకె ఫంక్షన్ హాల్లో నిర్వహించే రాష్ట్రస్థాయి విద్యా వైజ్ఞానిక సదస్సులను విజయవంతం చేయాలని కోరుతూ పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు భగత్ పిలుపునిచ్చారు. ఈతరుణంలో బీసీ హాస్టల్‌లో పోస్టర్లను విడుదల చేశారు. కూటమి ప్రభుత్వం తెచ్చిన జీఓ ఎంఎస్ 19, 20 వల్ల ప్రభుత్వ విద్యను పేదలకు దూరమవుతారన్నారు. పైగా ప్రాథమిక పాఠశాలల మూసి వేతకు కూటమి ప్రభుత్వం సిద్ధమవుతోందని ఆరోపించారు. వెంటనే ఫీజురీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయాలన్నారు.

నేడు చిలమత్తూరులో 'బాబు ష్యూరిటీ - మోసం గ్యారెంటీ'

చిలమత్తూరు: 'బాబు ష్యూరిటీ మోసం – గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా బుధవారం వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త టీఎన్ దీపిక మండలంలో పర్యటించనున్నట్లు ఆ పార్టీ మండల కన్వీనర్ రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. ఉదయం 9 గంటల నుంచి దేమకేతేపల్లి పంచాయితీ గాఢ్రాళ్లపల్లిలో కార్యక్రమం ప్రారంభమవుతుందని, టేకులోడు, కోడూరు, చాగలేరు, పలగలపల్లి, సోమఘట్ట, మొరసలపల్లి, కొడికొండ పంచాయితీల్లో ఆమె పర్యటిస్తారని తెలిపారు.

ప్రకృతి వ్యవసాయం లాభదాయకం



పంటను పరిశీలిస్తున్న అధికారులు

మడకశిరరూరల్: మండల పరిధిలోని ఆమిదాలగొంది పంచాయతీలో మంగళవారం ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు డీపీఎం లక్ష్మీనాయక్, అధికారులు రైతులు సాగు చేసిన వివిధ పంటలను పరిశీలించారు. రైతులు రజిని, నారాయణప్ప, శివప్ప, అనసూయమ్మ తదితరులు సాగు చేసిన వివిధ రకాల పంటలను బృందం సభ్యులు పరిశీలించారు. డీపీఎం మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం ద్వారా అధిక లాభాలు పొందవచ్చాన్నారు.

ఉపాధ్యక్షుడిగా తిప్పేస్వామి

పావగడ: తాలూకాలోని బ్యాడనూరు గ్రామ పంచాయతీ ఉపాధ్యక్షుడిగా తిప్పేస్వామి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన ఎన్నికల్లో ఎలాంటి జేడీఎస్, కాంగ్రెస్ సభ్యులందరూ తిప్పేస్వామిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

నూతన భవనాల ప్రారంభమెప్పుడో ?



ప్రారంభోత్సవానికి నోచుకోని దేమకేతేపల్లి -2 సచివాలయ భవనం

చిలమత్తూరు: మండలంలోని దేమకేతేపల్లి-2 సచివాలయం, పలగలపల్లిలోని సచివాలయ భవనాల నిర్మాణం పూర్తయినా ప్రారంభానికి నోచుకోవడం లేదు. నిర్మాణాలు పూర్తయి రెండేళ్లు గడచిపోతున్నా మండలస్థాయి అధికారుల నిర్లక్ష్యం కారణంగానే నూతన భవనాలు శిథిలావస్థకు చేరుకుంటున్నాయని ప్రజలు వాపోతున్నారు. కాంట్రాక్టర్లకు బిల్లులు పెట్టకపోవడంతో ఈ ఇబ్బందులు తలెత్తుతున్నట్లు చెబుతున్నారు. కాంట్రాక్టర్లకు బిల్లులు అయితే గాని వాళ్లు భవనాలు అప్పజెప్పే పరిస్థితి లేదంటున్నారు. కనీసం ఇప్పటికైనా సంబంధిత అధికారులు మొద్దు నిద్ర వీడి భవనాలను ప్రారంభించాలని కోరుతున్నారు.

ఆశల సాగు



వేరుశనగ విత్తుతున్న రైతులు

మడకశిరరూరల్: మండలంలో పడుతున్న జల్లుల వర్షానికి రైతులు వేరుశనగ విత్తనాలు విత్తుకొంటున్నారు. వివిధ గ్రామాల్లో రైతులు పోలాల్లో వేరుశనగ విత్తనాలు విత్తుకొంటున్నారు. ఈ ఏడాది ఖరీఫ్ వేరుశనగ పంట సాగు ఇప్పటికే ఆలస్యం అయిందని మోస్తారు వర్షానికి బాడుగ ట్రాక్టర్‌తో విత్తనాలు విత్తుతున్నామని రైతులు చెబుతున్నారు. ఇప్పటికే నియోజకవర్గ వ్యాప్తంగా దాదాపు 1,350 ఎకరాలకు పైగా వేరుశనగ విత్తనాలు విత్తుకున్నట్లు అధికారులు చెబుతున్నారు.

శభాష్ .. హృతిక్



హృతిక్‌తో సైన్స్ టీచర్ రేణుకారాజ్

పావగడ: తాలూకాలోని అరసికెరె గ్రామం ప్రభుత్వ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థి హృతిక్ దక్షిణ భారతస్థాయి బాల వైజ్ఞానిక ప్రదర్శన పోటీలకు ఎంపికయ్యాడు. ఇటీవల బెంగుళూరులోని రాష్ట్ర పరిశోధన, శిక్షణ సంస్థ నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో హృతిక్ మూడో స్థానంలో నిలిచాడు. వృథా ప్లాస్టిక్ నిర్వహణ అనే అంశంపై చేసిన నమూనాలు ప్రదర్శించాడు. హృతిక్ దక్షిణ భారత పోటీలకు ఎంపికవడం పాఠశాలకు ఎంతో గర్వకారణమని పాఠశాల రాష్ట్ర ప్రశస్తి గ్రహీత సైన్స్ ఉపాధ్యాయుడు రేణుకారాజ్ హర్షం వ్యక్తం చేశారు.

వాహనాలు క్లియర్ చేయండి



ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య

హిందూపురం టౌన్: హిందూపురం ఎక్సైజ్‌స్టేషన్‌లో రికార్డులను పరిశీలించి, పెండింగ్ కేసులతో పాటు మద్యం అక్రమ రవాణా కేసుల్లో పట్టుబడిన వాహనాలు త్వరగా క్లియర్ చేయాలని ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య అన్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ శ్రీరామ్‌తో కలసి హిందూపురం ఎక్సైజ్ పోలీసుస్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కల్లు దుకాణల నుంచి కల్లు శాంపిల్స్ సేకరించి ల్యాబ్‌కు పంపించాలని, అలాగే కల్తీ కల్లు అరికట్టేలా అమ్మకందారులకు కౌన్సిలింగ్ ఇవ్వాలన్నారు. ఎక్కువ కేసులు కల్గిన వారిని జిల్లా బహిష్కరణకు సిఫార్సు చేయాలన్నారు.

మడకశిర: మడకశిరలో ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌ను మంగళవారం ఎక్సైజ్‌శాఖ డిప్యూటీ కమిషనర్ నాగముద్దయ్య, ఏఈఎస్ శ్రీరామ్ తనిఖీ చేశారు. వారు మాట్లాడుతూ కర్ణాటక రాష్ట్రం నుంచి అక్రమ మద్యం సరఫరా కాకుండా గట్టి నిఘా పెట్టాలని ఆదేశించారు. స్థానిక సీఐ మురళీకృష్ణ, ఎస్ఐ శంకర్ పాల్గొన్నారు.

మద్యం ప్యాకెట్లు స్వాధీనం

హిందూపురం టౌన్: చిలమత్తూరు మండలానికి చెందిన ఇద్దరు వ్యక్తుల వద్ద 114 మద్యం ప్యాకెట్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని సీఐ లక్ష్మీదుర్గయ్య తెలిపారు.

మున్సిపాలిటీ అవినీతిపై లోకాయుక్తలో ఫిర్యాదు

చిలమత్తూరు: హిందూపురం మున్సిపాలిటీలో జరిగిన అవినీతిపై న్యాయవాది గోవిందరాజులు మంగళవారం లోకాయుక్తలో ఫిర్యాదు చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి మున్సిపల్ కమిషనర్‌గా ఉన్న సంగం శ్రీనివాసులు డిప్యుటేషన్‌లో చేయని పనులకు బిల్లులు పెట్టించుకోవడం , పాత పనులకు కేవలం ఫొటోలు దిగి బిల్లులు మంజూరు చేయించుకోవడం, మార్కెట్ వేలంపాటలో అవినీతికి తెరతీసి మున్సిపాలిటీ ఆదాయానికి గండికొట్టడం, డంపింగ్ యార్డు లో రూ.4 కోట్లు స్కామ్, మున్సిపాలిటీ పరిదిలోని కొట్నూరులో మున్సిపాలిటీ స్థలాన్ని అక్రమించుకొని షెడ్డు నిర్మాణం, సీఎఫ్ఎంఎస్ ద్వారా చెల్లించాల్సిన బిల్లులు మున్సిపాలిటీ చెక్కులను నిబంధనలకు విరుద్ధంగా ఇచ్చారని ఫిర్యాదు చేసినట్లు గోవిందరాజులు తెలిపారు. ఇన్‌చార్జి మెడికల్ ఆఫీసర్‌గా పనిచేసిన శోభన్‌రెడ్డి, డీఈఈ మోహన్, ఏఈ శంకర్, డ్రాఫ్ట్‌స్‌మెన్ ఆనందరాజు, అకౌంటెంట్ మనోహర్ సహకారంతో అప్పటి మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు కాంట్రాక్టర్ ప్రభాకర్‌తో పాటు పలువురు లబ్ధి పొందారన్నారు.

నవ సమాజ నిర్మాణానికి కృషి



న్యాయవిజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న ఏడీజే శైలజ

హిందూపురం: పౌరులు సమాజం పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ ఆదర్శవంతమైన నిర్మాణం కోసం కృషి చేసినప్పుడే నవ సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని జిల్లా అదనపు జడ్జి కంపల్లె శైలజ సూచించారు. మంగళవారం హిందూపురం మండలం పూలకుంట ఐసీడీఎస్ కార్యాలయంలో సీడీపీఓ వరలక్ష్మి అధ్యక్షతన మానవ అక్రమ రవాణా నియంత్రణ – పౌరుల బాధ్యతపై జరిగిన న్యాయ విజ్ఞాన సదస్సు జరిగింది. జడ్జి మాట్లాడుతూ పిల్లల ప్రవర్తన, అలవాట్లపై తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు దృష్టి సారించాలన్నారు. ఎక్కడైనా చెడు కార్యకలాపాలు జరుగుతుంటే పోలీసుల దృష్టికి తీసుకెళ్లాలన్నారు. న్యాయవాదులు కళావతి, సంతోషికుమారి, రవిచంద్ర, మురళీ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక శోభ



రొద్దం: నాగుల పుట్ట వద్ద పూజలు నిర్వహిస్తున్న భక్తులు



అలంకరణలో రత్నగిరి కొల్హాపురి మహాలక్ష్మీదేవి

రొద్దం: నాగుల పంచమి సందర్భంగా మండల కేంద్రంలోని పెన్నానది ఒడ్డున పుట్ట వద్ద మహిళలు మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. పుట్టలో పాలు పోసి మొక్కులు చెల్లించుకున్నారు.

అమరాపురం: మండల పరిధిలోని మద్దనకుంటలో మాల కులస్తుల ఆధ్వర్యంలో నాగుల విగ్రహ ప్రతిష్ఠాపన మంగళవారం ఘనంగా జరిగింది. నూతనంగా తయారు చేసిన విగ్రహాలను అర్చకులు మంత్రోచ్ఛరణల మధ్య ప్రాణ ప్రతిష్ఠ చేశారు.

హిందూపురం: హిందూపురంలోని బెంగళూరురోడ్డు నింకంపల్లి వద్ద ఉన్న యల్లమ్మదేవి ఆలయ 9వ వార్షికోత్సవ మహోత్సవం పూజలు మంగళవారం ఘనంగా జరిగాయి. అమ్మవారికి పంచామృతాభిషేకాలు నిర్వహించి పూజలు నిర్వహించారు. గణపతి, నవగ్రహ, సుబ్రమణేశ్వర, గజలక్ష్మీదేవి హోమాలు చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు.

రొళ్ల: రత్నగిరి కొల్హాపురి మహాలక్ష్మీదేవి ఆలయంలో శ్రావణ మాసం సందర్భంగా మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని కొలిచే గ్రామస్తులతో పాటు చుట్టు పక్కల గ్రామాలు, కర్ణాటక ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు.



అమరాపురం: నాగులను ప్రతిష్ఠించిన దృశ్యం



హిందూపురం: అలంకరణలో యల్లమ్మదేవి

హామీల అమలులో 'కూటమి' విఫలం

- గ్రామస్థాయిలో వైఎస్సార్‌సీపీని బలోపేతం చేయాలి
- వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప



కొడిగేపల్లిలో మోసం గ్యారెంటీ క్యూఆర్‌కోడ్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప, పార్టీ శ్రేణులు

మడకశిరరూరల్: రాజకీయాల్లో 40 ఏళ్ల అనుభవం ఉందని గొప్పలు చెప్పుకుంటున్న సీఎం చంద్రబాబు హామీల అమలులో మాత్రం ఎప్పుడూ విఫలమవుతూనే ఉన్నారని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప విమర్శించారు. సీ కొడిగేపల్లి, మణూరు, కల్లుమర్రి పంచాయతీ కేంద్రాల్లో మంగళవారం బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈరలక్కప్ప మాట్లాడుతూ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పార్టీలకు అతీతంగా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు అందించిన విషయాన్ని గుర్తు చేశారు. 2019 ఎన్నికల హామీలను వంద శాతం అమలు చేసిన చూపించిన ఘనత వైఎస్ జగన్‌కే దక్కిందన్నారు. గత ఎన్నికల్లో కూటమి నాయకులు సూపర్ సిక్స్ అంటూ గ్రామాల్లో ప్రచారం చేసి ప్రజలను నమ్మించి ఓట్లు వేయించుకుని అధికారంలోకి వచ్చి 13 నెలలైనా ఒక్క పథకాన్ని కూడా సక్రమంగా అమలు చేయడంలేదని మండిపడ్డారు. ఇంటింటికీ వెళ్లి చంద్రబాబు మోసాలను ప్రజలకు వివరించాలని సూచించారు. మహిళా విభాగం రాష్ట్ర జనరల్ సెక్రటరీ, రాష్ట్ర కార్యదర్శి చౌళూరు మధుమతిరెడ్డి మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకంలో ఆడబిడ్డ నిధి కింద ఒక్కో మహిళకు నెలకు రూ.1500 ఇస్తామని చెప్పి అధికారంలోని వచ్చినా కూటమి ప్రభుత్వం ఇప్పుడు ఆడబిడ్డ నిధి ఎగొట్టే ప్రయత్నం చేస్తుందని మండిపడ్డారు. గ్రామస్థాయిలో పార్టీ బలోపేతమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచులు కవిత, రామలింగమ్మ, రాష్ట్ర కుంచిటి వక్కలిగ విభాగం అధ్యక్షుడు రంగేగౌడ్, వైఎస్సార్ మహిళా విభాగం రాష్ట్ర జాయింట్ సెక్రటరీ భారతీరెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు నరసింహమూర్తి, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ హనుమంతు, రాష్ట్ర బీసీసెల్ కార్యదర్శి సత్యనారాయణ యాదవ్, ఎంపీపీ కవిత, మాజీ సర్పంచ్ శ్రీరాములు, మల్లికార్జున, శేషాద్రి, సుధాకర్, నరసింహ, అంజలి, సికిందర్, అనిల్‌కుమార్ రెడ్డి, కరియన్న, రాజ్ కుమార్, రేకులకుంట హనుమంతరాయ, బసప్ప, తిమ్మారెడ్డి, గోవిందప్ప, శివరాజ్, సత్యనారాయణ, తిమ్మప్ప, మంజునాథ్, మూర్తి, సురేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మడకశిర: మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప

మడకశిర: ముఖ్యమంత్రి చంద్రబాబు మోసాలను వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఇంటింటికీ వెళ్లి వివరించాలని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ఎలా మోసం చేస్తున్నారో ప్రజలకు అర్థమయ్యేలా వివరించాలన్నారు. మంగళవారం పట్టణంలోని 13, 14, 15, 16 వార్డుల పరిధిలో పట్టణ కన్వీనర్ వాల్మీకి సతీష్‌కుమార్ అధ్యక్షతన భోగి రామలింగేశ్వరస్వామి ఆలయం వద్ద జరిగిన బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా క్యూ ఆర్ కోడ్ పోస్టర్లను మడకశిర మున్సిపాలిటీ పార్టీ ఇన్‌చార్జ్ భారతీరెడ్డిదేశాయి, వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి విడుదల చేశారు. ఈరలక్కప్ప, పార్టీ ఇన్‌చార్జ్ భారతిరెడ్డిదేశాయి మాట్లాడుతూ ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా చంద్రబాబు ప్రజలను అన్ని విధాలుగా మోసం చేశారని ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వానికి తగిన బుద్ధిచెప్పడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని, సమయం కోసం ఎదురు చూస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ వాల్మీకి సతీష్‌కుమార్, మాజీ మున్సిపల్ చైర్మన్ జయరాజ్, బీసీ సెల్ కార్యదర్శి సత్యనారాయణ, పట్టణ వైఎస్సార్‌సీపీ కమిటీల సభ్యులు గోపి, అంజలి, మధుసూదన్, ఫణియాదవ్, కోఆప్షన్ సభ్యుడు ఫక్రుద్దీన్, వెంకటేష్, నవీన్, ధను, నగేష్,సైఫుల్లా తదితరులు పాల్గొన్నారు.

అంకిత భావంతో పనిచేయండి



అధికారులతో సమావేశమైన మంత్రి సవిత

పెనుకొండ: మున్సిపల్ అధికారులు విధులను అంకితభావంతో నిర్వర్తించాలని చేయాలని, నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని రాష్ట్ర బీసీ సంక్షేమశాఖా మంత్రి సవిత హెచ్చరించారు. పట్టణంలోని తన క్యాంప్ కార్యాలయంలో మంగళవారం మున్సిపల్ అధికారులతో మంత్రి సమావేశం నిర్వహించారు. మంత్రి సవిత మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వం అందించే సేవలను తెలియజేయాల్సిన బాధ్యత ఉద్యోగులపై ఉందన్నారు. పని నిమిత్తం కార్యాలయాలకు వెళితే అక్కడ ఉద్యోగులు పట్టించుకోవడం లేదనే ఫిర్యాదులు తన దృష్టికి వస్తున్నాయన్నారు. ఎవరికైనా పనిచేయడానికి ఇష్టం లేకపోతే విధుల నుంచి తప్పుకోవాలన్నారు. ఆర్డీఓ ఆనంద్‌కుమార్, కమిషనర్ సతీష్‌కుమార్, ఎంపీడీఓ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

అధికారులపై చర్యలు తీసుకోవాలి

సోమందేపల్లి: మండలంలోని తుంగోడు సర్పంచ్ గంగమ్మతో మోసపూరితంగా సంతకం చేయించిన వీఆర్ఓలోకేష్, వీఆర్ఏ అంజిలపై చర్యలు తీసుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పెద్దన్న డిమాండ్ చేశారు. మంగళవారం తహసీల్దార్ మహేష్, ఎస్ఐ రమేష్ బాబులను కలిసి ఈ విషయంపై ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నారాయణరెడ్డి, సీపీఎం నాయకులు హనుమయ్య, రామకృష్ణ, రంగప్ప తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నేత జేసీబీ సీజ్

పరిగి: మండలంలో అక్రమంగా మట్టిని తవ్వుతున్న జేసీబీ వాహనాన్ని పట్టుకున్నట్లు ఎస్ఐ రంగడుయాదవ్ తెలిపారు. అధికారుల అనుమతులు లేకుండా నేతులపల్లికి చెందిన టీడీపీ నాయకుడికి చెందిన జేసీబీ వాహనంతో గ్రామ సమీపంలో మంగళవారం అక్రమంగా మట్టిని తవ్వుతుండగా స్వాధీనం చేసుకున్నామన్నారు. జేసీబీతో పాటు రెండు ట్రాక్టర్లను పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

పాఠశాలల తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న డీఈఓ కిష్టప్ప

అమరాపురం: మండలంలోని వివిధ పాఠశాలలను డీఈఓ కిష్టప్ప మంగళవారం తనిఖీ చేశారు. హలుకూరు, అమరాపురం, హేమావతిలోని పాఠశాలలను పరిశీలించి రికార్డులను తనిఖీ చేశారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను బోధించాలని ఉపాధ్యాయులకు సూచించారు.

అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

హిందూపురం టౌన్: పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న అతిథి అధ్యాపక పోస్టుల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ అనురాధ పేర్కొన్నారు. కళాశాలలో పౌరశాస్త్ర అధ్యాపక (సివిక్స్) ఆంగ్లం, తెలుగు మాధ్యమంలో బోధించేందుకు అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామన్నారు. అలాగే ఉర్దూ మీడియంలో ఎకనామిక్స్ అర్థశాస్త్రం బోధించేందుకు ఎంఏ ఎకనామిక్స్ ఉర్దూ మీడియం 50 శాతం మార్కులు పొందిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. ఈనెల 30లోగా దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

సంక్షిప్త సమాచారం

డ్రైవర్ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

పెనుకొండ: అవసరమైన సమయంలో డ్రైవర్లు (ఆన్‌కాల్ డ్రైవర్లు)గా విధులు నిర్వహించేందుకు ఆసక్తి కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఆర్టీసీ డిపో మేనేజర్ రంగభాష్యం ఒక ప్రకటనలో తెలిపారు. హెవీ లైసెన్స్ కలిగి కనీసం 18 నెలల అనుభవం ఉండి ఆర్టీఓ కార్యాలయంలో క్లియరెన్స్ సర్టిఫికెట్ కలిగి ఉండాలన్నారు. ఈనెల 31లోపు డిపో మేనేజర్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు

ద్విచక్ర వాహనం అపహరణ

సోమందేపల్లి: మండల కేంద్రంలోని షిర్డీ సాయిబాబా ఆలయం వద్ద ఈ నెల 26న పార్కింగ్ చేసి ఉన్నా ద్విచక్ర వాహనాన్ని గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లినట్లు బాధితుడు రంగేపల్లికి చెందిన శివశంకర్ తెలిపారు. రోజూ ఆలయం వద్ద వాహనం నిలిపి పరిశ్రమలో పనికి వెళ్లేవాడినన్నారు. బైక్ అపహరణపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం పరిశీలన

గోరంట్ల: మండల పరిధిలోని పాలసముద్రంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని ఎంపీపీ ప్రమీల మంగళవారం పరిశీలించారు. స్టాక్ రిజిస్టర్లతో పాటు చిన్నారుల హాజరు రిజిస్టర్ తనిఖీ చేశారు. వచ్చే పోషకాలను సక్రమంగా పంపిణీ చేయాలని సిబ్బందిని ఆదేశించారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

పెనుకొండ: మహిళలు ఆర్థికంగా ఎదగాలని టింబక్ట్ కలెక్టివ్ నిర్వాహకులు బబ్లూ గంగూలి, మేరీ వటమట్టం పేర్కొన్నారు. నగర పంచాయతీ పరిధిలోని తిమ్మాపురం వద్ద ఉన్న దుర్గాశక్తి సొసైటీ ఆవరణంలో సొసైటీ 14వ వార్షికోత్సవ మహాసభ మంగళవారం జరిగింది. నిర్వాహకులు మాట్లాడుతూ ప్రతి మహిళా పొదుపు చేసుకోవాలని, రుణాలు పొంది ఆర్థికంగా బలోపేతం కావాలన్నారు.

బాల్య వివాహాలను అరికట్టాలి

పరిగి: బాల్య వివాహాలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తహసీల్దార్ హసీనా సుల్తానా తెలిపారు. మండల కేంద్రం పరిగి ఎంపీడీఓ కార్యాలయ సమావేశ భవనంలో మంగళవారం బాల్య వివాహాలు, బాలికల సంరక్షణ, పోక్సో చట్టం తదితర అంశాలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రెడ్డప్ప, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శంకరమ్మ, డీసీపీలు నాగలక్ష్మీ, మురళీధర్, మేఘన తదితరులు పాల్గొన్నారు.

హెల్పర్స్ యూనియన్ ఎన్నిక

హిందూపురం: హిందూపురం అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ మహాసభల సందర్భంగా మంగళవారం ప్రాజెక్ట్ కమిటీని ఎన్నుకున్నట్లు మహాసభ కమిటీ ఎన్నిక జిల్లా కార్యదర్శి శ్రీదేవి, పట్టణ కన్వీనర్ రాము తెలిపారు. కమిటీ అధ్యక్షురాలిగా అరుణ, కార్యదర్శిగా శోభమ్మ, కోశాధికారిగా శశికళతో పాటు 26 మందిని ఎంపిక చేశామన్నారు.

బ్యాంకుల వద్ద జాగ్రత్తలు తీసుకోండి

పెనుకొండ: బ్యాంక్‌ల వద్ద సిబ్బంది రాత్రి వేళల్లో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్ఐ వెంకటేశ్వర్లు సూచించారు. హిందూపురం పట్టణంలో స్టేట్ బ్యాంక్‌లో భారీ చోరీ నేపథ్యంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బంది ద్వారా మంగళవారం నోటీసులు అందజేశారు. సీసీటీవీ కెమెరాలు తగిన విధంగా ఏర్పాటు చేయాలని, అలారం మోగడంపై ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు.

విశ్రాంత వీఆర్ఓ మృతి

అమరాపురం: మండలంలోని కాచికుంట గ్రామానికి చెందిన విశ్రాంత వీఆర్ఓ శ్రీనివాసగౌడ్ (72) సోమవారం అనారోగ్యంతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వాగేష్ కాచికుంట గ్రామానికి వెళ్లి ఆయన భౌతికకాయంపై పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. సాయంత్రం గ్రామంలోని శ్రీనివాసగౌడ్ వ్యవసాయ పొలంలో అంత్యక్రియలు నిర్వహించారు.

సమయ పాలన పాటించాలి

అగళి: సచివాలయ సిబ్బంది సమయ పాలన పాటించాలని ఎంపీడీఓ రాజేంద్ర ప్రసాద్, తహసీల్దార్ సుబ్బరావు సూచించారు. మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాయంలో సచివాలయ సిబ్బందితో మంగళవారం సమావేశం నిర్వహించారు. పీ4, విత్ అవుట్ ఆధార్ ఈకేవైసీ, స్వచ్ఛ సర్వేక్షణ్ తదితర వాటిపై సమీక్షించారు.